W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

30-3-2026

వరంగల్









03

## అక్రమ నిర్మాణాలకు అడ్డాగా 28వ డివిజన్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాశిబుగ్గ సర్కిల్ పరిధిలోని 28 వ డివిజన్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. 28వ డివిజన్ హంటర్ రోడ్ లోని బృందావన కాలనీ, సంతోషిమాత కాలనీ-2 , సాయినగర్ కాలనీ లలో అనుమతులు లేకున్నా విచ్చలవిడిగా బహుళ అంతస్తుల భవనాలు, ఇందులో వాణిజ్య వ్యాపార భవనాలు గృహ సముదాయాల తో పాటు భారీ షెడ్లు, సరైన పత్రాలు, పర్మిషన్ లేకపోయిన నిర్మాణాలు దర్జాగా చేపడుతున్నారు.

# అసెంబ్లీలో గర్జించిన నాయిని రాజేందర్

**తప్పైతే రాజీనామా చేస్తా సవాల్ విసిరిన ఎమ్మెల్యే నాయిని**



తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పాలనలో వేల కోట్ల అవినీతి చేసిన వారు ఇప్పుడు దొంగలే దొంగ అని ఆరోపించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. బిఆర్ఎస్ నాయకులు సుమారు 200 కోట్ల అక్రమ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించిన ఆయన, ఈ వ్యవహారంపై వెంటనే సిబిఐ, సిఐడి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహా వరంగల్ బ్యూరో

02





# కడియంకు మద్దతుగా సభ

**పాడి కౌశిక్ చిల్లర చేష్టలు.. భగ్గుమన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

సీనియర్ శాసన సభ్యుడు కడియం శ్రీహరి బీఆంఎస్ నాయకుల వైఖరిని తప్పుబడుతూ మాట్లా డుతున్న సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు తీవ్ర దుమారం రేపింది. కడియం శ్రీహరిని అవమానించేట్లు బాడీ లాంగ్వేజ్‌ను ప్రదర్శించడం, చేతి వేళ్లతో కాల్చేస్తామ న్న భావన వచ్చేట్లు వ్యవహరించడంపై అధికార పక్షం నాయకులు తీవ్రంగా స్పందించారు. - మహా వరంగల్ బ్యూరో



06

## వీకర్స్ కాలనీలో రోడ్డు కోసం రచ్చ

వరంగల్ 19వ డివిజన్ కాశీబుగ్గ ప్రాంతంలోని వీకర్స్ కాలనీలో రోడ్డు కోసం గత ఐదు నెలలుగా స్థానిక యువత తో పాటు కొంతమంది స్థానికలతో ప్లాట్ యజమాని న్యాయపోరాటం చేస్తున్నాడు. లే ఔట్ ప్లాన్‌లో లేని రోడ్డు కోసం కొంతమంది యువ కులు కాలనీ వాసుల తో కలిసి పట్టుబడుతున్నారు.



## ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు

05


వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

FOLLOW: @ANNTELUGU
30-3-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
వరంగల్
మహా పత్రిక
ANN తెలుగు

# అసెంబ్లీలో గర్జించిన నాయిని రాజేందర్ రెడ్డి

## 200 కోట్ల దోపిడీ పై సిబిసిఐడి దర్యాప్తుకు డిమాండ్

### తప్పైతే రాజీనామా చేస్తా సవాల్ విసిరిన ఎమ్మెల్యే నాయిని



**మహా వరంగల్ బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రతిపక్షాల పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పాలనలో వేల కోట్ల అవినీతి చేసిన వారు ఇప్పుడు దొంగలే దొంగ అని ఆరోపించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. బిఆర్ ఎస్ నాయకులు సుమారు 200 కోట్ల అక్రమ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించిన ఆయన, ఈ వ్యవహారంపై వెంటనే సిబిఐ, సిఐడి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ అవసరమని స్పష్టం చేశారు. తాను చేసిన ఆరోపణలు తప్పని నిరూపితమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. అదే విధంగా కేటీఆర్, హరీష్ రావు కూడా రాజీనామాకు సిద్ధమా అని ప్రశ్నిస్తూ సవాల్ విసిరారు. హనుమకొండలో పార్క్ భూమిని ఆక్రమించి పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారనే ఆరోపణలను ప్రస్తావిస్తూ, దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తన రాజీనామా లేఖను నేరుగా స్పీకర్ కు పంపిస్తున్నానని తెలిపారు. ప్రతిపక్షాలకు ధైర్యం ఉంటే తమపై వచ్చిన ఆరోపణలు తప్పని నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు.

# పరీక్షల ఒత్తిడిని జయించండి ఆత్మ విశ్వాసంతో సాగండి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**మహా వరంగల్ బ్యూరో:** పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే అని భయ పడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటె విజయం సాధ్యమేనని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఆదివారం వర్ధన్నపేటలోని ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థినులతో మమేకమై వారి చదువు, పరీక్షల సన్నాహాలు, హాస్టల్ సౌకర్యాల పై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్ట్రెస్ మేనేజ్‌మెంట్ తో పాటు పరీక్షల పై విద్యార్థులకు కలెక్టర్ అవగాహన కల్పిస్తూ క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతో చదువుకుంటూ పాఠాలను పునరావృతం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఒత్తిడికి లోనుకాకుండా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, అవసరమైనప్పుడు ఉపాధ్యాయులు, వార్డెన్ల ను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. సరైన నిద్ర, పోషకాహారం, వ్యాయామం కూడా మానసిక ప్రశాంతతకు ఎంతో దోహదపడతాయని వివరించారు. జిల్లాలోని మండలాల స్పెషల్ ఆఫీసర్ల ద్వారా ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ విద్యాసంస్థలలో విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్ తో పాటు పరీక్షల పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పరీక్షల భయాన్ని తొలగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, అవసరమైన సరుకుల నాణ్యత, నిల్వ విధానం సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన చదువు వాతావరణం కల్పించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీసీడీవో పుష్పలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, హాస్టల్ వార్డెన్, సంబంధిత శాఖల అధికారులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల సేకరణ వేగవంతం చేయండి





**మహా వరంగల్ బ్యూరో:** గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధికి పన్నుల సేకరణే అత్యంత కీలకమని, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ఆదివారం హనుమకొండ, వరంగల్ సర్కిల్ పరిధిల్లోని పలు డివిజన్లలో ఆకస్మికంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో పన్నుల వసూలు తీరును సమీక్షించారు. ముందుగా వరంగల్‌లోని 14వ డివిజన్ తో పాటు 37, 38 డివిజన్లలో అధికారులు నిర్వహిస్తున్న పన్నుల సేకరణ పనులను పరిశీలించారు. అనంతరం హనుమకొండలోని 5వ డివిజన్ పరిధిలోని సురేంద్రపురి, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి పన్నుల వసూలు చేస్తున్న సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు నిర్వహిస్తున్న వసూళ్ల పై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పన్నుల సేకరణలో వేగం పెంచాలని, లక్ష్య సాధనకు మిగిలిన సమయాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవాలని సూచించారు. ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉన్నందున, ప్రతి అధికారి, ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను పై ఎలాంటి వడ్డీ మాఫీ లేదని మరోసారి స్పష్టం చేశారు. నగర ప్రజలు ఈ నెల 31వ తేదీ లోపు పన్నులు చెల్లించి జరిమానా భారాన్ని నివారించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పన్నులు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డాగా 28వ డివిజన్

## సరైన పత్రాలు, పర్మిషన్ లేకపోయిన విచ్చలవిడిగా నిర్మాణాలు

## కాసుల కక్కుర్తిలో బల్దియా అధికారులు

**మహా వరంగల్ బ్యూరో:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాశిబుగ్గ సర్కిల్ పరిధిలోని 28 వ డివిజన్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. 28వ డివిజన్ హంటర్ రోడ్ లోని బృందావన కాలనీ, సంతోషిమాత కాలనీ-2 , సాయినగర్ కాలనీ లలో అనుమతులు లేకున్నా విచ్చలవిడిగా బహుళ అంతస్తుల భవనాలు, ఇందులో వాణిజ్య వ్యాపార భవనాలు గృహ సముదాయాల తో పాటు భారీ షెడ్లు, సరైన పత్రాలు, పర్మిషన్ లేకపోయిన నిర్మాణాలు దర్జాగా చేపడుతున్నారు. డివిజన్ పరిధిలో నిర్మించిన నిర్మిస్తున్న భవనాలు అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. ముఖ్యంగా ఎఫ్టీఎల్ ప్రాంతాల్లో దర్జాగా అనుమతులు లేకున్నా ఇంటి నెంబర్లు రాకున్నా అక్రమ నిర్మాణాలు పూర్తి చేస్తున్నారని అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ వాటిని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఫిర్యాదులు వచ్చిన సంబంధిత అధికారులు సిబ్బంది (టౌన్ ప్లానింగ్) రెవిన్యూ ఇన్స్పెక్టర్ స్థానిక నాయకులతో చేతులు కలిపి కాసులకు కక్కుర్తి పడుతున్నారు. స్థానిక నాయకుడి తో కుమ్మక్కై సంబంధిత అధికారులు సిబ్బంది ఇంటి నెంబర్ కు ఒక రేటు, పర్మిషన్ ఉన్నా ఒక రేటు, పర్మిషన్స్ లేని వాణిజ్య నివాస భవనాలకు వాటికి వేరువేరుగా మరో రేటు నిర్ణయించి లక్షల్లో దండు కుంటున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా భద్రకాళి బండి కింద ఉన్న స్థలాలు ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లో ఉండడంతో కొంతమందికి పర్మిషన్లు ఇంటి నెంబర్లు రాక పోయిన దర్జాగా భవనాలు నిర్మిస్తున్నారు. కొన్ని స్థలాలకు సరైన పత్రాలు లేకున్నా బహులంతస్తులు చక చక నిర్మిస్తున్నారు. ఈ 28వ డివిజన్ లో స్థానిక నాయకుల అండ తో పాటు టౌన్ ప్లానింగ్, సర్కిల్ అధికారులు సిబ్బంది లెక్కకు తేలని రెసిడెన్షియల్, కమర్షియల్ బహులంతస్తులు నిర్మాణాలు పూర్తి చేశారని ఇంకా చేస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా బల్దియా కమిషనర్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించి ఈ అక్రమ నిర్మాణాలకు అక్రమ వసూళ్ల కు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# మండల అధ్యక్ష పదవులకు దరఖాస్తులు

## స్వీకరించిన డీసీసీ అధ్యక్షులు ఎండి అయూబ్






**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో మండల డివిజన్ అధ్యక్ష పదవుల కోసం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మొదట వర్ధన్నపేట మండలంలోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించగా, అనంతరం పర్వతగిరి మండలంలోని జేఆర్ఆర్ గార్డెన్స్‌లో కూడా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగిన నాయకత్వాన్ని ఎంపిక చేయడం అత్యంత కీలకం అని అన్నారు. పార్టీలు మారకుండా కాంగ్రెస్ జెండాను మోసిన వారికే అత్యధిక ప్రాధాన్యమిస్తూ కేంద్ర గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి అర్హత, అనుభవం, ప్రజలతో అనుబంధం కలిగిన నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మర్చిపోదని, ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో సరైన అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పార్టీ పట్ల విశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం కలిగినవారే భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కొత్త ఉత్సాహం వచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత సమన్వయం, క్రమశిక్షణతో పార్టీని ముందుకు తీసుకెళ్తామని అయూబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల డివిజన్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తల తో పాటు పదవులకు ఆసక్తి చూపుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

# కడియంకు మద్దతుగా సభ

**మహా, వరంగల్ బ్యూరో:** సీనియర్ శాసన సభ్యుడు కడియం శ్రీహరి బీఆర్ఎస్ నాయకుల వైఖరిని తప్పుబడుతూ మాట్లాడుతున్న సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు తీవ్ర దుమారం రేపింది. కడియం శ్రీహరిని అవమానించేట్లు బాడీ లాంగ్వేజ్‌ను ప్రదర్శించడం, చేతి వేళ్లతో కాల్చేస్తామన్న భావన వచ్చేట్లు వ్యవహరించడంపై అధికార పక్షం నాయకులు తీవ్రంగా స్పందించారు. దళిత, ఆదివాసీ ప్రజాప్రతినిధులతోపాటు 20మందికిపైగా ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ విప్‌లు కౌశిక్ రెడ్డి వైఖరిని తప్పుబట్టారు. సభా సాంప్రదాయాలను తుంగలో తొక్కేట్లు వ్యవహరించిన కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీ సంఖ్యలో సభ్యులంతా స్పందించడంతో పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారంపై అటు ముఖ్యమంత్రి ఇటు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన సభలోని అధికార పక్షం అంతా ఏకతాటిపైకి వచ్చి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.




# ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు

- జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎన్పిడీసీఎల్ చైర్మన్
- కాలేజీ అభివృద్ధికి ఇ.వి శ్రీనివాస్ కృషి అభినందనీయం
- కాలేజీని అమ్మగా భావిస్తూ భావోద్వేగానికి లోనైనా పూర్వ విద్యార్థులు







**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి, ఎన్ పిడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత శిఖరాలకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కూడా ఈ కళాశాలకు చెందిన ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. బీటెక్ చదివిన వారికంటే పాలిటెక్నిక్ చదివిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువగా ఉండి, త్వరగా ఉపాధి అవకాశాలు లభించి స్థిరపడతారని చెప్పారు. రూ.28 కోట్లతో నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి మళ్లీ పూర్వ విద్యార్థులందరూ రావాలని ఆకాంక్షించారు. తన కుటుంబానికి కూడా పాలిటెక్నిక్ విద్యతో అనుబంధం ఉందని, తన తండ్రి పాలిటెక్నిక్ చదివి ఉన్నత ఉద్యోగం సాధించారని, ఆ ప్రేరణ తోనే తాను కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## స్కిల్స్ ఉంటే అవకాశాలు అపారం

ఎన్ పిడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యకు గొప్ప ప్రాధాన్యం ఉందన్నారు. డిప్లమా, ఇంజినీరింగ్ మధ్య తేడా లేదని, నైపుణ్యమే విజయానికి మూలమని పేర్కొన్నారు. ఎ× మనుషులను భర్తీ చేయదని, కొత్త సాంకేతికతలను నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రత్యేకత

పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉన్నత హోదాల్లో పాలిటెక్నిక్ విద్యార్థులు

చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ నేడు సాంకేతిక విద్యలో విశిష్ట గుర్తింపు పొందింది. వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాలను అధిరోహించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులుగా ఎదిగి కళాశాలకు కీర్తి తెచ్చారు. మరి ఎంతోమంది బీహెచ్ఈఎల్, ఎచ్ఏఎల్, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎచ్సీఎల్, డీఆర్‌డీవో, ఇస్రో, ఐడీపీఎల్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## ప్రారంభ దశ.. అభివృద్ధి పథం

ఈ కళాశాల ప్రారంభదశలో అజంజాహి మిల్లు ప్రాం గణంలోని ఒక షెడ్డులో 120 మంది విద్యార్థులతో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులతో ప్రారం భమైంది. 1955 జూలై 10న 16 ఎకరాల విస్తీర్ణంలో నూతన క్యాంపస్‌కు శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం కళాశాలలో 1620 మంది విద్యార్థులు చదువు కుంటుండగా,150 మంది అధ్యాపకులు, సిబ్బంది సేవలందిస్తున్నారు. 1995-96లో ఈసీఈ, కంప్యూటర్ కోర్సులు ప్రారంభమై, తరువాత సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు కూడా ప్రవేశ పెట్టబడ్డాయి.

## జ్ఞాపకాల సందడి

20 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి అల్లర్లు, గురువులతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఎన్నేళ్ల తర్వాత స్నేహితులను కలవడం మరపురాని అనుభూతిగా భావించి ఆనందం వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో మళ్లీ కూర్చొని ఉత్సాహంగా గడిపారు. తమ కాలేజీని అమ్మగా భావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమం అధ్యంతం కన్నులపండువగా సాగింది. కార్యక్రమ విజయానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్, సంగీత కళాశాల బృందం, పూర్వ విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# వీకర్స్ కాలనీలో రోడ్డు కోసం రచ్చ

## కుడా ప్లాట్ ను రోడ్డుగా సృష్టిస్తున్న స్థానిక యువత

## న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన ప్లాట్ యజమాని

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ 19వ డివిజన్ కాశీబుగ్గ ప్రాంతంలోని వీకర్స్ కాలనీలో రోడ్డు కోసం గత ఐదు నెలలుగా స్థానిక యువత తో పాటు కొంతమంది స్థానికలతో ప్లాట్ యజమాని న్యాయపోరాటం చేస్తున్నాడు. లే ఔట్ ప్లాన్ లో లేని రోడ్డు కోసం కొంతమంది యువకులు కాలనీ వాసుల తో కలిసి పట్టుబడుతున్నారు. ఈ అంశం గతంలో జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ తో పాటు కొండా దంపతులకు ఇరువర్గాలు కూడా ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రేటర్ వరంగల్ నగరంలోనే మొట్టమొదటి కుడా లేఔట్ గా ది కాశిబుగ్గ కో-ఆ పరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరుతో ఏర్పడింది. ఆజంజాహి మిల్లు కు చెందిన 16 ఎకరాల 25 గుంటల భూమిని కుడా వారు విక్రయించి 1987 సంవత్సరంలో లేఔట్ చేసి 4/87 డిపి నెంబర్ తో అప్రూవల్ ఇచ్చి సొసైటీకి అప్పచెప్పడం జరిగింది. దీనికి అన్ని అనుమతుల తో పాటు పార్కు, రోడ్లు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కాగా ఇందులో 55 వ సర్వే నెంబర్ లో గల 179 ఫ్లాట్ నెంబర్ లో గల స్థలాన్ని మూడు ఫ్లాట్లు గా విభజించి సొసైటీ వారు స్థానిక పెద్దలకు అందజేసినట్లు సమాచారం. వారిలో ఒకరైన స్థానిక కార్పొరేటర్ ఓని భాస్కర్ కు 100 గజాలు రాగా ఆ స్థలాన్ని 2010 లో రిజిస్ట్రేషన్ చేసుకుని అవసరాల నిమిత్తం 2018 లో ప్రహరీ గోడ తో సహా అంజుమ్ పర్వీన్ మలిక్ కు అమ్మడం జరిగింది. వారు కూడా వారి అవసరాల నిమిత్తం 2019 లో గజాల థరనుమ్ కు అమ్మడం జరిగింది. మార్కెట్ వాల్యూ తో పాటు సరైన పత్రాలతో మాలిక్ కొనుగోలు చేసిన ఈ స్థలంలో బోరు వేసారు. కాగా ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం కాగా ఈ స్థలం రోడ్డు కు సంబంధించిందని కొంతమంది స్థానిక యువత కాలనీ వాసుల తో ఉదేశపూర్వకంగా రోడ్డు ఎక్కి గొడవలు సృష్టిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.




ఇండ్ల మధ్యలో అసలు అక్కడ రోడ్డు లేదని ఇవన్నీ కుడా అనుమతులు పొందిన ఫ్లాట్లు అని స్థానికులు అంటున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం కార్పొరేటర్ భర్త రోడ్డు ను ఆక్రమించి ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కొంతమంది వీకర్స్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కానీ ఈ స్థలం పూర్తిగా కుడా ఫ్లాట్ అని సరైన పత్రాలతో విక్రయించిన స్థలంగా కుడా, బల్దియా అధికారులు కూడా నిర్ధారించారు. పైగా ఇటీవల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా బిల్డింగ్ పర్మిషన్ కు పూర్తి అనుమతులు కూడా లభించాయని యజమాని చెబుతున్నారు. కానీ కొంతమంది యువకులు దీని రోడ్డుగా సృష్టించి కావాలనే గొడవలు సృష్టించి ఫ్లాటు ను విక్రయించిన వారిని బెదిరిస్తూ గొడవలు సృష్టిస్తూ యజమాని తో పాటు స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అన్ని అనుమతులతో నిర్మాణ పనులు చేపట్టగా ఆదివారం కొంతమంది యువకులు స్థానికులతో కలిసి గొడవకు దిగారని దీంతో 100 డయల్ కు ఫోన్ చేయగా ఘటన స్థలానికి పోలీసులు రావడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చివరకు చేసేదేమీ లేక సదరు యజమాని ఇంతె జార్గంజ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ముఖ్యంగా వీకర్స్ కాలనీకి వెనుక వైపు నుండి రోడ్డు ఉన్నప్పటికీ కొంతమంది యువకులు పనికట్టుకొని కూడా లేఅవుట్ ప్లాన్ లో లేని రోడ్డు ను సృష్టించి వారికి నేరుగా రోడ్డు కావాలనే ఉద్దేశంతో ఈ స్థలాన్ని వివాదంలోకి నెట్టుతున్నారని స్థల యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదాన్ని పోలీసులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మాకు న్యాయం చేయాలని యజమాని వేడుకుంటున్నాడు.

